సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023



సామర్థ్యమెంత..!

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం ఎలా ఉందనేది తెలుసుకునేందుకు విద్యాశాఖాధికారులు సిద్ధమయ్యారు. IIలో



సెలవుల్లోనూ కాలేజీల నిర్వహణ

దసరా సెలవుల్లో నగరంలోని కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు యథావిధిగా పనిచేశాయి. IIలో



రైతుబజార్లలో సీసీ కెమెరాలు

నగరంలోని 13 రైతుబజార్లలో సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు మరమ్మతులకు ఏర్పాట్లు చేస్తున్నారు. IIలో

జీవీఎంసీకి నూతన కార్యాలయం

- ముడసర్లోవలోని 4.37 ఎకరాల్లో నిర్మాణానికి పచ్చజెండా
- పీపీపీ పద్ధతిలో డీ–శాలినేషన్ ప్లాంట్ ఏర్పాటు
- రూ.500 కోట్లతో మధురవాడలో మురుగునీటి శుద్ధి వ్యవస్థ
- మూడు నెలల్లో శ్మశాన వాటికల ఆధునికీకరణ
- మొత్తం 75 అంశాలకు ఆమోదముద్ర
- వాడీవేడిగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం







మాజీ కార్పొరేటర్ కొల్లాబత్తుల వెంగళరావు మృతికి సంతాపం తెలుపుతున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కార్పొరేటర్లు

డాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) నూతన కార్యాలయ నిర్మాణం, పీపీపీ పద్ధతిలో డీ–శాలినేషన్ ప్లాంట్ ఏర్పాటు, మధురవాడలో రూ.500 కోట్లతో మురుగునీటి శుద్ధి వ్యవస్థ, బయో మైనింగ్, రానున్న మూడు నెలల్లో శ్మశాన వాటికల ఆధునికీకరణ, వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తదితర అంశాలకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వాడీవేడిగా జరిగిన సమావేశంలో మొత్తం 57 సాధారణ అంశాలు, 11 అనుబంధ అంశాలతో పాటు 7 టేబుల్ అజెండాకు ఆమోదముద్ర పడింది. వీధిలైట్ల సమస్యపై సంబంధిత ఏజెన్సీకి ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, అవసరమైతే ఒప్పందం రద్దు చేస్తామని కమిషనర్ సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు.

సమావేశం ప్రారంభమైందిలా..

ఉదయం 11 గంటలకు మేయర్ హరి వెంకట కుమారి కౌన్సిల్‌కు వచ్చారు. బెల్ మోగించి కౌన్సిల్ సమావేశం ప్రారంభిస్తూ ముందుగా విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ కార్పొరేటర్ కొల్లాబత్తుల వెంగళరావు మృతికి మేయర్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత, టీడీపీ కార్పొరేటర్ గంధం శ్రీనివాస్, సీపీఐ ఫ్లోర్ లీడర్ ఎ.జె.స్టాలిన్, జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంత లక్ష్మి, కౌన్సిల్ సభ్యులు సంతాపం తెలిపారు. తర్వాత అజెండా అంశాలపై చర్చను మేయర్ ప్రారంభించారు. దీంతో ప్రతిపక్షాలు టీడీఆర్‌పై చర్చ జరగాలని పట్టుబట్టాయి. దీనిపై మేయర్ స్పందిస్తూ జీరో అవర్‌లో మీ సమస్యలు చెప్పుకోవాలని, ముందు అజెండాలోకి వెళ్దామని స్పష్టం చేశారు. కానీ ప్రతిపక్ష సభ్యులు టీడీఆర్‌పై నిరసన చేపట్టి.. మేయర్ పోడియం చుట్టుముట్టారు. కౌన్సిల్‌కి నిబంధనలు ఉన్నాయని, పోడియంను చుట్టుముట్టే హక్కు లేదని మేయర్ వారిని హెచ్చరించారు. ఆ తర్వాత టీడీఆర్‌లకు సంబంధించి అధికారులు వివరణ ఇచ్చారు.

మురికివాడలను అభివృద్ధి చేయాలి

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచపటంలో విశాఖకు గుర్తింపు రావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆర్‌డీపీలు, టీడీఆర్‌లపై అధికారులు వివరణ ఇచ్చి.. సభ్యుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. నగరంలోని మురికివాడలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ పరిపాలన రాజధానిగా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో పెందుర్తి, గాజువాక, భీమిలి ప్రాంతాలను అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. భీమిలి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నాలుగో వార్డులో రూ.9.18కోట్లతో రోడ్లు నిర్మించడంపై హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ సభ్యుల హంగామా

ఒకవైపు నగర అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే అంశాలపై చర్చ జరుగుతుండగా.. ప్రతిపక్ష టీడీపీ సభ్యులు ప్రతీ అంశాన్ని వ్యతిరేకించే ప్రయత్నం చేశారు. మురుగునీటి శుద్ధి వ్యవస్థ, డీ–శాలినేషన్ ప్లాంట్, రోడ్ల అభివృద్ధిని సైతం వ్యతిరేకిస్తూ.. సమావేశంలో హంగామా చేశారు. ఏకంగా కార్యదర్శి వద్దకు దూసుకెళ్లి.. పేపర్లను చించివేసే ప్రయత్నం చేశారు. దీనిపై మేయర్ తీవ్రంగా స్పందించడంతో కాస్త వెనక్కి తగ్గారు.

ఆమోదించిన ప్రధాన అంశాలివే..

- పారిశ్రామిక నీటి అవసరాల కోసం అప్పికొండ వద్ద పీపీపీ పద్ధతిలో ఏర్పాటు చేసే 100 ఎంఎల్‌డీ డీ–శాలినేషన్ ప్లాంట్ అంశం చర్చకు వచ్చింది. పలువురు సభ్యులు దీనిపై వివరణ కోరగా.. సంబంధిత అధికారి వివరణ ఇచ్చారు. జీవీఎంసీ నుంచి ఒక్క రూపాయి పెట్టేది లేదని, పీపీపీ పద్ధతిలో ప్లాంట్ ఏర్పాటు చేసి.. వారి నుంచి జీవీఎంసీ మంచి నీటిని తీసుకుని పరిశ్రమలకు సరఫరా చేస్తుందన్నారు. దీంతో ప్లాంట్ ఏర్పాటుకు సభ్యులు ఆమోదముద్ర వేశారు.
- శ్మశాన వాటికల ఆధునికీకరణ జరగడం లేదని పలువురు కార్పొరేటర్లు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మేయర్ స్పందించి జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు వివరణ కోరారు. ఈ అంశంపై ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికల అభివృద్ధి, ఆధునికీకరణకు సంబంధించి టెండర్లు పిలిచామన్నారు. అయితే కొన్ని చోట్ల ఎవరూ ముందుకు రాలేదన్నారు. మూడు నెలల్లో శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తామని కౌన్సిల్‌కు తెలిపారు.
- జోన్–3 పరిధి 14వ వార్డు ఏఎస్‌ఆర్ నగర్ బిలాల్ కాలనీని మురికివాడ ప్రాంతంగా నోటిఫై చేస్తూ.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే అంశాన్ని ఆమోదించారు. దీనిపై విపక్షాల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ అంశంపై కార్పొరేటర్ అనిల్‌కుమార్ రాజు మాట్లాడుతూ ఇక్కడ 275 కుటుంబాలు నివసిస్తున్నాయని.. వీరంతా 30 ఏళ్లుగా కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదన్నారు. ఇక్కడ తగిన సౌకర్యాలు కల్పించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు.



- జోన్–2 పరిధి మధురవాడలో మురుగునీటి శుద్ధి వ్యవస్థ ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.500 కోట్ల రుణాన్ని సమీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకునే అంశంపై చర్చ సాగింది. దీనిపై అధికారులు మాట్లాడుతూ రుషికొండ నుంచి కాపులుప్పాడ వరకు 6 పంపు స్టేషన్లు, 50 ఎంఎల్‌డీ సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మిస్తామన్నారు. ఈ వ్యవస్థ ఏర్పాటుతో 6 నుంచి 13వ వార్డు వరకు ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.
- జోన్–4 పరిధి 38వ వార్డులో రీడింగ్ రూమ్ నుంచి ప్రభుత్వ విక్టోరియా(ఘోషాస్పత్రి) మీదుగా కంచరవీధి, బీచ్‌రోడ్డుకు రహదారి విస్తరణ అంశంపై జరిగిన చర్చలో కార్పొరేటర్ సాధిక్ మాట్లాడారు. రీడింగ్ రూమ్ నుంచి ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి వరకు రోడ్డు విస్తరణకు ఆమోదం తెలిపారు. అయితే కంచరవీధిలో యాసీన బాబా దర్గా ఉందని.. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు.
- మధురవాడలో సర్వే నంబర్ 192/12పిలో గల ప్రైవేట్ స్థలంలో కొంత భాగం(సుమారు 484.39 చదరపు గజాలు) భూమి జీవీఎంసీకి బదలాయింపు, లేఅవుట్ నంబర్ 5/87లోని జీవీఎంసీ ఖాళీ స్థలంలో సుమారు 484.39 చదరపు గజాల సమానా భూమి మార్పిడికి సంబంధించిన అంశంపై చర్చ జరిగింది. చివరకు సభ్యులు ఆమోదం తెలిపారు.



నగర జనాభా, పరిధి, జీవీఎంసీ కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే 40, 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముడసర్లోవలోని 4.37 ఎకరాల కార్పొరేషన్ స్థలంలో నూతన ప్రధాన కార్యాలయ నిర్మాణానికి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. పారిశ్రామిక నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన విస్కో కార్యాలయం కూడా అక్కడే ఏర్పాటు చేయనున్నారు. నూతన కార్యాలయ సముదాయంలో అన్ని సెక్షన్లు, కౌన్సిల్ హాల్, ఇతర సౌకర్యాల కల్పనపై పలుమార్లు విభాగాల అధిపతులతో చర్చించి.. వారి సూచనలు, అభ్యర్థనను పరిగణలోకి తీసుకున్నారు. కమిషనర్ సూచనల మేరకు కన్సల్టెంట్ సంస్థ రూపొందించిన డిజైన్లను సభ్యులు పరిశీలించారు.

వీధిలైట్ల వెలుగులపై ప్రత్యేక ఫోకస్



కమిషనర్ సాయికాంత్ వర్మ

సమావేశంలో పలువురు సభ్యులు తమ వార్డుల్లో వీధిలైట్లు వెలగడం లేదని మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మేయర్ స్పందిస్తూ నగరాభివృద్ధిలో దూసుకుపోతున్నప్పటికీ.. వీధిలైట్ల సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించలేకపోతున్నట్లు చెప్పారు. దీనిపై కమిషనర్ వివరణ ఇచ్చారు. జీవీఎంసీ పరిధిలో 1.18 లక్షల వీధిలైట్లు ఉన్నాయని.. వీటి నిర్వహణ బాధ్యతలను ఐదు నెలల కిందట బ్రిడ్జ్ అండ్ రూఫ్ కంపెనీకి అప్పగించామన్నారు. అలాగే యాప్ కూడా ఏర్పాటు చేశామని, ఆ యాప్ ద్వారా ఎక్కడ లైట్లు వెలగడం లేదో గుర్తిస్తున్నట్లు చెప్పారు. వీధిలైట్ల సమస్యపై పది రోజుల కిందట ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు వెల్లడించారు. వారి పనితీరు మెరుగవ్వకపోతే ఒప్పందాన్ని రద్దు చేస్తామన్నారు. ఆ ఏజెన్సీ చేపట్టిన పనులకు సంబంధించి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని చెప్పారు.

న్యూస్‌రీల్

సంతానలక్ష్మిగా కనకమహాలక్ష్మి



కలువపూల పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారు గురువారం సంతానలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కలువపూలతో పూజ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. శుక్రవారం విద్యాలక్ష్మిగా అమ్మవారు దర్శనమివ్వనున్నారని, శ్రీపుష్పయాగం పూజ నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు.

ఐఈఆర్‌పీలకు నియామక పత్రాల అందజేత



నియామక పత్రాన్ని అందజేస్తున్న జేసీ విశ్వనాథన్

విశాఖ విద్య: సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్(ఐఈఆర్‌పీ)లుగా ఎంపికైన వారికి జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ నియామక పత్రాలను గురువారం అందజేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 37 పోస్టుల భర్తీకి సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. వివిధ దశల్లో వడపోత అనంతరం మెరిట్‌లో నిలిచిన వారిని ఎంపిక చేశారు. 37 మందిని ఎంపిక చేయగా.. ఇద్దరు ఏజెన్సీ ప్రాంత పోస్టింగ్‌ల్లో చేరేందుకు నిరాకరించారు. దీంతో 35 మందికి జేసీ చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేసినట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.అబ్దుల్ ఆషా పాల్గొన్నారు.

జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారిగా సయ్యద్



సయ్యద్ సిరాజుల్లాను అభినందిస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట: జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖాధికారిగా సయ్యద్ సిరాజుల్లా గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిరాజుల్లా జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. వారు మైనార్టీ కార్యాలయం స్థితిగతుల గురించి చర్చించారు. అనంతరం సయ్యద్ సిరాజుల్లాను మైనార్టీ కార్యాలయం సిబ్బంది, గ్రామ/వార్డు సచివాలయ కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష

6,400 మందికి వైద్య పరీక్షలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గురువారం 21 ప్రాంతాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో 6,400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అర్బన్ పరిధిలో 19 ప్రాంతాల్లో 5,403 మందికి, రూరల్‌లో రెండు ప్రాంతాల్లో 997 మందికి వైద్య సేవలందించినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. సంతపేట, చిన్నబజార్, లక్ష్మీనగర్, రిక్షా కాలనీ, గాంధీనగర్, ఎంవీపీ కాలనీ,ఇందిరానగర్, రాజేంద్రనగర్, రంగీరాజువీధి పెయిందొరపేట, దండుబజార్, వెంకటేశ్వర మెట్ట, న్యూ వెంకటేశ్వర కాలనీ, మాధవధార, సిద్ధార్థనగర్, భారత్ నగర్, నెల్లిముక్కు, సీతానగరం, దయాల్ నగర్, సుసర్లకాలనీ, పెందుర్తి, రామకృష్ణనగర్, రామవరం, బి.ఆర్ తాళ్లవలస తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. శుక్రవారం అర్బన్ పరిధిలో 23, రూరల్‌లో రెండు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తారు.

వైద్య ఆరోగ్యశాఖ వాహనాలకు ఈ-వేలం

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి పనిచేయకుండా ఉన్న 14 వాహనాలను ఈనెల 31న ఈ–వేలం వేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఆ రోజు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ–వేలం కార్యక్రమం జరుగుతుందన్నారు. http@//ko nugou.ap.gov.in వెబ్‌సైట్ లో పూర్తి వివరాలు ఉంటాయని పేర్కొన్నారు.

జగనన్న చేదోడు రూ.13.33 కోట్లు



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

- జిల్లాలో 13,332 మంది లబ్ధిదారులు
- పేదలకు అండగా ప్రభుత్వం
- కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : పేదలకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు బహిరంగ సభ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగో ఏడాది జగనన్న చేదోడు పథకం కింద రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీలకు ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి నేరుగా ఖాతాల్లో జమచేశారు. కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్ మల్లికార్జున కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం కింద జిల్లాలో 5,942 మంది రజకలు, 1,521 మంది నాయిబ్రాహ్మణులు, 5,862 మంది దర్జీ లబ్ధిదారులకు మొత్తం రూ.13.33 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ఇంకా ఎవరైనా అర్హులై ఉండి మిగిలిపోయి ఉంటే సంబంధిత సచివాలయంలో నమోదు చేసుకున్నట్లయితే.. వారికి వచ్చే ద్వైవార్షిక కార్యక్రమంలో మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం కలెక్టర్ ప్రజాప్రతినిధులతో కలిసి నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ యువశ్రీ, నాయీ బ్రాహ్మణుల కార్పొరేషన్ డైరెక్టర్ వి.నూకరాజు, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.ప్రసాద్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేద ప్రజల జీవితాల్లో మార్పు



నవరత్నాల ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుంది. పేద ప్రజల జీవితాల్లో ఇలాంటి కార్యక్రమాల వల్ల ఎంతో మార్పు వస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికంగా చేయూత అందిస్తోంది.

– రాలి రవణమ్మ, కొబ్బరితోట

ఎంతో ఉపయోగకరం



జగనన్న చేదోడు పథకం ద్వారా వచ్చిన నగదులో కొంత మొత్తం మేము నిర్వహిస్తున్న షాపులకు మదుపునకు ఉపయోగిస్తాం. ఇంకొంత వ్యాపార అభివృద్ధికి దోహదపడుతోంది. ప్రతి ఒక్కరి అభ్యున్నతే లక్ష్యంగా పలు పథకాలు అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలి.

– నమ్మిని కనకమహాలక్ష్మి

చంద్రబాబు పాలన అంతా అవినీతే..

- స్కీంలు పెట్టి స్కామ్‌లు చేశారు.. హామీలను గాలికొదిలేశారు
- అవినీతి లేని సంక్షేమ పాలన జగన్ సొంతం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, చిత్రంలో మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు

ఆనందపురం : చంద్రబాబు పాలన అంతా అవినీతిమయంగా సాగిందని, దీంతో రాష్ట్రం అథోగతి పాలై.. చివరికి ఆయన జైలుకు వెళ్లారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో గల చెన్నా కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' అనే అంశంపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన భీమిలి నియోజకవర్గం పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజలకు న్యాయం చేసే వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అయితే, ప్రజా సంక్షేమం పేరుతో స్కీంలు పెట్టి స్కామ్‌లు చేసే వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. టీడీపీ హయంలో అమలు పరిచిన అన్ని పథకాలలోను అవినీతి చోటుచేసుకుందని, నాయకులు పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడ్డారని చెప్పారు. అవినీతికి పాల్పడబట్టే చంద్రబాబు జైలుకు వెళ్లారని తెలిపారు. జైలులో ఉన్న అవినీతిపరుడు కోసం ఆ పార్టీ నేతలు యాత్రలు చేస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నవంబర్ 1 నుంచి జరిగే ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. అలాగే ప్రతి కుటుంబాన్ని కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారో తెలియజేసి ప్రజా మద్దతు కోరాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో పార్టీ జెండాను ఆవిష్కరించాలని చెప్పారు. సామాజిక న్యాయం పేరుతో ఈ నెల 28న తగరపువలసలో జరగనున్న బస్సు యాత్ర, బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు.

సామాజిక న్యాయ ప్రధాత జగన్

అంబేడ్కర్ స్ఫూర్తితో సమాజంలో అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తున్న సామాజిక న్యాయ ప్రధాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని.. అందుకే అతను మళ్లీ సీఎం కావాలని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఇంటికే వచ్చి వైద్యం అందించడం స్వాతంత్ర్య భారతదేశంలో ఇదే తొలిసారని కొనియాడారు. వ్యవస్థలను మేనేజ్ చేసిన చంద్రబాబు పాపం పండి జైలు కెళ్లారని తెలిపారు. అతని పాపాల చిట్టాను న్యాయస్థానం ముందు ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా పార్టీలోని అన్ని స్థాయిల నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రగతిని వివరించాలన్నారు. సంక్షేమ కార్యక్రమాలు తెలిసే విధంగా ప్రతి సచివాలయం వద్దే ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి ఇంటి పైన పార్టీ జెండాను ఆవిష్కరింపచేయాలన్నారు. రాష్ట్రంలో కొన్ని పత్రికలు, టీవీ చానళ్లు దోపిడీదారులకు కొమ్ము కాయడం సిగ్గు చేటన్నారు.

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఇచ్ఛాపురం నుంచి ఇడుపులపాయ వరకు సంపూర్ణ ప్రజా మద్దతు ఉందని రానున్న ఎన్నికలో 175 స్థానాలు గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మూడు జిల్లాల యూత్ కో–ఆర్డినేటర్ ముత్తంశెట్టి నందీష్‌బాబు, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ప్రభుత్వ విప్, పార్టీ ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి, నవరత్నాల కార్యక్రమాల ఇన్‌చార్జి నారాయణ మూర్తి, పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వంగపండు ఉష, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పెదబాబు, భీమిలి, పద్మనాభం ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీలు గాడు వెంకటప్పడు, సుంకరి గిరిబాబు, కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, కోరాడ లక్ష్మణరావు, గాడు శ్రీను, మజ్జి వెంకటరావు, బంటుబిల్లి మణిశంకర నాయుడు, పాండ్రంకి శ్రీను, వంకాయల మారుతీ ప్రసాద్, షణ్ముఖరావు, కొప్పల ప్రభావతి, బావిశెట్టి పార్వతమ్మ, వెంకటరెడ్డి, పోతిన హనుమంతు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

హ్యాండ్‌బాల్ పోటీల్లో కేవీ–1 విద్యార్థుల ప్రతిభ

కంచరపాలెం: న్యూఢిల్లీలో జరిగిన కేవిఎస్ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో కంచరపాలెం ఇండస్ట్రీయల్ ఎస్టేట్ 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం –1 విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గాదె కిషోర్ తెలిపారు. హ్యాండ్ బాల్ పోటీల్లో స్వర్ణ, కాంస్య పతకాలు సాధించి విద్యాలయ కీర్తి పతాకాన్ని జాతీయ స్థాయిలో ఎగురవేశారన్నారు. అండర్–14 బాలురు విభాగంలో స్వర్ణ పతకం, అండర్–14 బాలికల విభాగంలో కాంస్య పతకం సాధించారని పేర్కొన్నారు. అండర్–14 బాలురు దేవరాజ్, లోచన్ మాణిక్య, రేవంత్, ఇనోష్ వీర్, స్వయమ్ కుమార్ సాహు, అండర్–14 బాలికలు కుమారి గీతిక, జాహ్నవిలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ)కి ఎంపికైనట్లు తెలిపారు. విజేత విద్యార్థులను గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.



స్వర్ణ, కాంస్య పతకాలతో విద్యార్థులు

కేజీహెచ్‌కు 9 అంబులెన్స్‌ల వితరణ

రూ.2.50 కోట్లు వెచ్చించిన హెచ్‌పీసీఎల్

మహారాణిపేట: హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ విశాఖ రిఫైనరీ(హెచ్‌పీసీఎల్) సంస్థ రూ.2.50 కోట్లతో 9 అంబులెన్స్‌లను కొనుగోలు చేసి కేజీహెచ్‌కు అందించింది. ఈ అంబులెన్స్‌లు గురువారం కేజీహెచ్‌కు చేరుకున్నాయి. వీటిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని చేతులమీదుగా ఈ నెల 21న ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా.. హెచ్‌పీసీఎల్ సంస్థ సామాజిక బాధ్యతగా వీటిని కేజీహెచ్‌కు అందించింది. ఈ అంశంపై గతంలో హెచ్‌పీసీఎల్, కేజీహెచ్ మధ్య ఒప్పందం జరిగిందని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు.



కేజీహెచ్‌కు చేరుకున్న అంబులెన్స్‌లు

రూ.11.25 కోట్లతో ఎంఆర్ఐ స్కాన్

కేజీహెచ్‌కు చేరుకున్న ఎంఆర్ఐ స్కాన్ మెషీన్ త్వరలోనే రోగులకు అందుబాటులోకి రానుంది. ఈ మెషీన్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూ.11.25 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసింది.



ఎంఆర్ఐ స్కాన్



సిటీ స్కాన్

21న సిటీ స్కాన్ ప్రారంభం

ప్రస్తుతం కేజీహెచ్‌లో సిటీ స్కాన్ యంత్రాన్ని అమర్చుతున్నారు. ఈ యంత్రాన్ని ఈ నెల 21న మంత్రి విడదల రజని ప్రారంభించనున్నారు. రూ.3.82 కోట్లు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం సిటీ స్కాన్ యంత్రాన్ని కేజీహెచ్‌కు సమకూర్చింది.

హస్తకళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- లేపాక్షి నూతన షోరూం ప్రారంభం


లేపాక్షి నూతన షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అల్లిపురం: నగరంలో మరో లేపాక్షి నూతన షోరూంను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం ప్రారంభించారు. వాల్తేర్ మెయిన్‌రోడ్డు, రామ్‌నగర్‌లోని వీఎంఆర్డీఏ వాణిజ్య కేంద్రంలో అత్యాధునిక షోరూమ్ అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హస్తకళలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కళాకారుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్నామన్నారు. హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్స్, ఇండస్ట్రీస్ అండ్ కమర్షియల్ డిపార్టమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత మాట్లాడుతూ ఏపీ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కళాకారుల తయారు చేసే ఉత్పత్తుల మార్కెటింగ్‌కు రాష్ట్రంలో 17 షోరూంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 2 లక్షల మంది హస్తకళాకారుల వీటి ద్వారా ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ షోరూంల ద్వారా చిత్తూరు వుడ్ కార్వింగ్, బొబ్బిలి వీణ, ఏటికొప్పాక బొమ్మలు, కొండపల్లి బొమ్మలు, శ్రీకాళహస్తి కళంకారి బొమ్మలకు మార్కెటింగ్ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ హ్యాండీ క్రాఫ్ట్ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.విశ్వ తదితరులు పాల్గొన్నారు.

సుజాత కుటుంబానికి అండగా ఉంటాం

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి


మృతురాలి తల్లిని ఓదార్చుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

ఆరిలోవ: ద్వారకానగర్‌లో హత్యకు గురైన ఆరిలోవకు చెందిన సువ్వాడ సుజాత కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వరుదు కల్యాణి పరామర్శించారు. సుజాతను పిన్నింటి ఉమామహేశ్వరరావు వ్యక్తిగత కారణాలతో బుధవారం ద్వారకానగర్‌లో హత్య చేసి తాను కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆరిలోవ ప్రాంతం టి.ఐ.సి పాయింట్ వద్ద నివాసముంటున్న ఆమె తల్లిదండ్రులు, పిల్లలను కలిశారు. వారిని ఓదార్చి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా పోలీసులు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సుజాత పిల్లల చదువు బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందని చెబుతూ.. కలెక్టర్ మల్లికార్జునతో ఫోన్‌లో మాట్లాడారు. 10వ తరగతి వరకు వారికి ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాలల్లో విద్య అందించడానికి, ప్రభుత్వ హాస్టల్‌లో వసతి సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. దిశ డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ సింహాద్రినాయుడు, ఆరిలోవ సీఐ సోమశేఖర్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నల్ల కృపాజ్యోతి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీదేవి పాల్గొన్నారు.

శారదా పీఠాన్ని సందర్శించిన మంత్రి కారుమూరి


స్వామిజీ ఆశీస్సులు తీసుకుంటున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

పెందుర్తి: విశాఖ శ్రీశారదా పీఠాన్ని రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు గురువారం సందర్శించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామిజీలను కలుసుకుని ఆశీస్సులు తీసుకున్నారు. ముందుగా పీఠంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల్లో భాగంగా రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో పూజలందుకోవడానికి అర్చామూర్తిని శాస్త్రోక్తంగా ఆలయంలోనికి ప్రవేశింపజేశారు. స్వామీజీల పర్యవేక్షణలో వేదోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు పీఠంలో సామూహిక అక్షరాభ్యాసాలు

ఉత్సవాల్లో భాగంగా పీఠంలో శుక్రవారం అమ్మవారి సన్నిధిలో సరస్వతిదేవి పూజ, సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నట్లు పీఠం ప్రతినిధులు తెలిపారు. పూజలో ఉంచిన పుస్తకాలు, పెన్నులు విద్యార్థులకు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు.

సామర్థ్యమెంత..!

- నవంబర్ 3న ప్రభుత్వ, ప్రైవేట్ బడుల్లో ప్రత్యేక పరీక్ష
- 3, 6, 9 తరగతి విద్యార్థులకు ప్రత్యేకం
- భవిష్యత్‌లో సిలబస్ మార్పునకు పక్కాగా కసరత్తు
- ఇంజినీరింగ్ విద్యార్థులకు పరీక్షల నిర్వహణ బాధ్యతలు


తరగతి గదిలో విద్యార్థులు (ఫైల్)

విశాఖ విద్య: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం ఎలా ఉందనేది తెలుసుకునేందుకు విద్యాశాఖాధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్ఈఏఎస్) – 2023 పేరిట రాష్ట్ర స్థాయిలో నవంబర్ 3న ప్రత్యేక పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసమని ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో గల 2,267 పాఠశాలలను ఎంపిక చేశారు. టోఫెల్ వంటి పరీక్షల నిర్వహణతో మన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విద్యా కార్యక్రమాలను అమలు చేస్తోంది. భవిష్యత్ చదువులు మరింత పటిష్టంగా సాగేలా పక్కా ప్రణాళికలు తయారు చేసే క్రమంలో విద్యార్థుల చదువుల సామర్థ్యాన్ని పక్కాగా లెక్క తీయాలని ప్రభుత్వం ఆదేశించడంతో దీన్ని విద్యాశాఖాధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 2,267 స్కూళ్ల ఎంపిక

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 4,944, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 1,400 పాఠశాలలు ఉన్నాయి. శాంపిల్ సర్వేలో భాగంగా మూడు జిల్లాల పరిధిలో 2,267 స్కూళ్లను ఎంపిక చేశారు. వీటిలో విశాఖపట్నం జిల్లాలో 525, అనకాపల్లిలో 1,000, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 742 పాఠశాలలు ఉన్నాయి. ఆయా స్కూళ్లలో 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక పరీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయిలో దీనిని నిర్వహిస్తున్నందున జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

సామర్థ్యం తెలుసుకునేలా...

3వ తరగతి విద్యార్థులకు వారు చదువుతున్న పాఠ్యాంశాలపైనే ప్రశ్నలతో కూడిన పరీక్ష నిర్వహిస్తారు. 6వ తరగతి విద్యార్థులకైతే ఐదో తరగతి సిలబస్‌తో లాంగ్వేజ్, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులు, 9వ తరగతి వారికి 8వ తరగతి సిలబస్‌తో లాంగ్వేజ్, గణితం, సైన్సు, సోషల్ సబ్జెక్టుకు సంబంధించిన పరీక్ష నిర్వహించనున్నారు. 3, 6వ తరగతుల వారికి 40 ప్రశ్నలతో కూడిన పరీక్షకు ఒక గంట సమయం ఇవ్వనున్నారు. 9వ తరగతి విద్యార్థులకు 60 ప్రశ్నలతో కూడిన పరీక్షకు 1:30 గంటల సమయం కేటాయించనున్నారు.

ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా ఇంజినీరింగ్ విద్యార్థులు

డైట్ అధ్యాపకుల పర్యవేక్షణలో ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు బాధ్యత అప్పగించి, వారిని పాఠశాలలకు పంపించి పరీక్ష నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసమని విశాఖ జిల్లాలో 577 మంది, అనకాపల్లి జిల్లాలో 1,101 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 818 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. పరీక్ష ఎలా నిర్వహించాలనే దానిపై వీరికి ఆయా జిల్లా కేంద్రాల్లో రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ శిక్షణకు ఆయా జిల్లాల డీఈవో, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్, డీసీఈబీ సెక్రటరీ కో – ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేతో విద్యార్థులు చదువుల్లో ఎలా రాణిస్తున్నారో తెలుసుకోవచ్చు. పరీక్ష నిర్వహణకు ఇంజినీరింగ్ విద్యార్థులకు బాధ్యతలు అప్పగిస్తున్నాం. వీరికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంతా సమన్వయంతో పరీక్ష నిర్వహించేలా దృష్టి సారించాం. వాస్తవికతను తెలుసుకునేలా పరీక్షను సమర్థవంతంగా నిర్వహిస్తాం.

– ఎల్.చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

నాణ్యమైన చదువు కోసమే..



విద్యార్థులకు నాణ్యమైన చదువు అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం. ఆ దిశగానే పాఠశాలల్లో విద్యా కార్యక్రమాలు అమలవుతున్నాయి. బోధనలో అనేక మార్పులు వచ్చాయి. ఇలాంటి సర్వేల ద్వారా వచ్చే ఫలితాలు ఉపయోగకరంగా ఉంటాయి. సర్వే పక్కాగా చేపట్టాలని విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల డీఈవోలను అప్రమత్తం చేశాం.

–ఎం.జ్యోతికుమారి, ఆర్‌జేడీ

మహిళ హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

సీతమ్మధార: ద్వారకానగర్ 3వ లైన్‌లోని సత్య శ్రీదేవి ఎన్‌క్లేవ్‌లో దారుణ హత్యకు గురైన సువ్వాడ సుజాత కేసు దర్యాప్తును ద్వారకా సీఐ సింహాద్రినాయుడు తన బృందంతో ముమ్మరం చేశారు. గురువారం అపార్టుమెంట్‌లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఆమె పని చేస్తున్న టెలీకాలర్ సంస్థ యాజమాన్యంతో చర్చించారు. ఇద్దర మధ్య ఘర్షణ అనంతరం జరిగిన పరిణామాలపై వివరాలు సేకరించారు. లావాదేవీలపై ఆరా తీశారు. సుజాత మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొన్నేళ్లుగా ఉమామహేశ్వరరావు తన కుమార్తెను వేధిస్తున్నాడని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా.. ఆరిలోవకు చెందిన సుజాత ఇక్కడ టెలీకాలర్‌గా పని చేస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. భర్తకు దూరంగా ఉంటోంది. బుధవారం ఆమెను ఉమామహేశ్వరరావు హత్య చేసిన సంగతి తెలిసిందే.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,760
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,700
వెండి(కిలో):	రూ.77,000



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.90
బ్రాయిలర్ (లైవ్)	: రూ.110
స్కిన్	: రూ.180
స్కిన్‌లెస్	: రూ.190

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	540.00
విజయనగరం	544.00
శ్రీకాకుళం	544.00

సెలవుల్లోనూ కాలేజీల నిర్వహణ

ఇంటర్ బోర్డు అధికారుల ఆదేశాలు బేఖాతర్


ఎన్ఏడీ కూడలిలోని ఎస్ఆర్ఐ కాలేజీలో విద్యార్థులు

విశాఖ విద్య: దసరా సెలవుల్లో నగరంలోని కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు యథావిధిగా పనిచేశాయి. ఎన్ఏడీ కూడలిలోని ఎస్ఆర్ఐ జూనియర్ కాలేజీలో రికార్డులు రాయాలనే పేరుతో విద్యార్థులను రప్పించారు. కాలేజీలోనే పుస్తకాలు విక్రయించారు. సైన్సు కోర్సులు చదివే విద్యార్థులు సెలవుల్లో ఇళ్ల వద్ద రికార్డులు రాసి తీసుకురావాలని సూచించారు. ముందుగా ఒప్పందం చేసుకున్న ఫీజులో సగం చెల్లించిన వారికే రికార్డు పుస్తకాలు ఇస్తామని చెప్పడంతో.. విద్యార్థులు ఫీజు కౌంటర్ వద్ద బారులుదీరారు. ఎన్ఏడీ కూడలిలోని నారాయణ కళాశాలలోనూ విద్యార్థులు కనిపించారు. గురుద్వార్ సమీపం శాంతిపురంలోని కైట్ కాలేజీలో సీఏ కోర్సుకు తర్ఫీదు పొందే విద్యార్థులకు శిక్షణ పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఇదే చోట ఉన్న రెజోనోన్స్ స్టడీ సెంటర్(దీనికి అనుమతుల్లేవని అధికారులు చెబుతున్నారు) నుంచి గురువారం విద్యార్థులను ఇళ్లకు పంపించారు. దసరా సెలవుల్లో జూనియర్ కాలేజీలు తెరవవద్దని ముందుగా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు హెచ్చరించారు. స్పెషల్ క్లాసుల పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురి చేయవద్దని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ స్పష్టం చేసింది. అయినా కొన్ని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఈ ఆదేశాలను పెడచెవిన పెట్టాయి. దసరా సెలవులైనా కుటుంబ సభ్యులతో గడిపేందుకు అవకాశం లేకుండా పోతుందని ఆయా కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యాల ఒత్తిడితో విధులకు హాజరుకావాల్సి వస్తోందని చెబుతున్నారు. గురువారం పని చేసిన ప్రైవేట్ కళాశాలల వివరాలను సేకరిస్తున్నట్లు ఆర్ఐవో రాయల సత్యనారాయణ వెల్లడించారు.

ఎస్కలేటర్లు పనిచేయక అవస్థలు


ఎనిమిదో నెంబర్ ప్లాట్‌ఫాంపై పనిచేయని ఎస్కలేటర్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఎస్కలేటర్లు సరిగా పనిచేయక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సాయంత్రం 8వ నెంబర్, 1వ నెంబర్ ప్లాట్‌ఫాంలపై ఉన్న ఎస్కలేటర్లలో ఒక్కొక్కటి మాత్రమే పనిచేసింది. గోదావరి, రత్నాచల్, జన్మభూమి, కాచిగూడ వంటి ప్రధాన రైళ్లు ఇక్కడ నుంచి బయల్దేరే సమయంలోనే ఎస్కలేటర్లు పనిచేయలేదు. దీంతో ఆయా ప్లాట్‌ఫాంలకు వచ్చే వృద్ధులు, రోగులు మెట్లు ఎక్కలేక నానా అవస్థలు పడ్డారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో నిత్యం ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకున్న పాపానపోలేదు.

పాపం పసివాడు


బాలుడిని బాలల సదన్‌కు తరలిస్తున్న మమత

విశాఖ విద్య: పెదవాల్తేరు రాణి చంద్రమణిదేవి ఆస్పత్రి దగ్గర ఓ బాలుడిని ఎవరో చెట్టుకు కట్టేసి వదిలి వెళ్లిపోయారు. మానసిక వికలాంగుడు కావడంతో గంటల తరబడి అక్కడే బాలుడు నరక యాతన అనుభవించాడు. ఈ విషయాన్ని కొంతమంది మమత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఎల్లేటి మమతకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఆమె అక్కడికి చేరుకుని బాలుడి దయనీయ పరిస్థితిని చూసి చలించిపోయారు. మల మూత్ర విసర్జనతో అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న ఆ బాలుడిని అక్కడ నుంచి వేరే చోటకు తీసుకెళ్లి సపర్యలు చేశారు. మూడవ పట్టణ సీఐ కె.రామారావు ఆదేశాలతో కానిస్టేబుల్ శ్యామ్ సుందర్‌తో కలసి చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సదన్‌కు తీసుకెళ్లారు. కాళ్లు, చేతులు సరిగా పనిచేయకపోగా.. మాటలు కూడా రాకపోవడంతో ఆ బాలుడి వివరాలు తెలియరాలేదు. కుటుంబసభ్యులొచ్చి తీసుకెళ్లే వరకు అతన్ని బాలల సదన్‌లో ఉంచేలా తగిన ఏర్పాట్లు చేశారు.

రైతుబజార్లలో సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి

సీతమ్మధార: నగరంలోని 13 రైతుబజార్లలో సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు మరమ్మతులపై గుంటూరులోని ప్రధాన కార్యాలయంలో చర్చించినట్లు జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ తెలిపారు. గురువారం రాత్రి సీతమ్మధార రైతుబజారును ఆయన సందర్శించారు. రైతుల స్టాళ్ల వద్దకు వెళ్లి వారి ఐడీ కార్డులు, ధరల పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ రైతుబజారులో ఎవరైనా స్టాళ్లు ఇప్పిస్తామని, డ్రాలో మీకు వచ్చేలా చేస్తామని అంటే తక్షణమే తమకు సమాచారమివ్వాలని కోరారు. ఇప్పటికే రైతుబజారల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులకు బోర్డుపై ఉన్న ధరలకు నాణ్యమైన కూరగాయలనే విక్రయించాలని సూచించారు.